# ఆహుతి !

చలపతిరావు.... ఇందిరమ్మ.... భార్యా భర్తలిద్దరూ పెద్దకూమారుడు చంద్రం దగ్గరకు వైజాగ్ బయల్దేరారు.

సెకండరీగ్రేడ్ స్కూల్ టీచర్ చేసి పదేళ్ల నాడే రిటైరైనాడు. ఏటా కాన్పులతో మనిషి గుల్లైంది ఇందిరమ్మ.

పోయినవారు పోగా... ముగ్గురు మగ సంతానం మిగలి... బతికి బట్టకట్టారు.

ముగ్గురు పిల్లలనూ సాకి... పెంచి చదివించటానికి... ఆర్థిక పరిస్థితి అనుకూలించక అప్పుల పాలుకావలసి వచ్చింది చలపతిరావు.

అప్పటికే... వెనకటి రోజులు కావటంతో ట్యూషన్ చెప్పించుకునేటందుకొచ్చే కుర్రాళ్లు... ఒకరు పాలు.. మరొకరు కూరగాయలు... ఉదారంగా తెచ్చి ఇవ్వటంతో ఏదో రకంగా రోజులు వెళ్లి పోయినయ్.

ఆరోజుల్లో ఇంటి అద్దెకూడా తక్కువే! పది రూపాయలకు నాలుగు గదుల పెంకుటిల్లు దొరికింది, అన్నీ చవక రోజులు... మళ్లీ కళ్లతో చూద్దామన్నా అలాంటి రోజులు రావన్పిస్తుంది చలపతిరావుకి.

ఇప్పుడేమో... జీతాలు ఎక్కువే... ధరలూ అధికమే.. అన్నీవున్నా ఏమిలేనట్టే అన్పిస్తుంది. ప్రతి వారిలోనూ ఏదో అసంతృప్తి.. వెలితి తొంగిచూస్తోంది.

రోగాలు... ఆస్పత్రి ఖర్చులూ పెరిగినయ్. అంతటా పొల్యూషనే! దేవుడిచ్చిన నీటిని గాలినీ కూడా కలుషితం చేస్తున్నాం! అందుకే.. డాక్టర్లకు సైతం అంతు చిక్కని రోగాలు. కాలం మారిపోయంది. కాలంతో పాటు మనుషులు... మనస్తత్వాలూ మారుతున్నాయ్.

మనుషుల్లో వెనకటి ప్రేమలు... ఆప్యాయతలు మృగ్యమైనయ్. రాను రాను అందరిలోనూ వ్యాపార ధోరణి ప్రస్ఫుటంగా అవుపిస్తోంది.

అసలు మనుషుల గురించి వస్తున్న మార్పు గురించీ ఆలోచిస్తూంటే చలపతిరావుకి మతిపోతోంది.

పింఛన్ లేని రోజుల్లో రిటైరైన చలపతి రావుకి అన్నీ ఇబ్బందులే! కష్టాలను అధిగమించలేని పరిస్థితి!

కొడుకులు ముగ్గురూ పంపేడబ్బుతో బతకటం కష్టతరంగా తోస్తోంది. పిల్లల మీదే తమ ఆశలన్నీ! తమని ఎలా కడతేరుస్తారో ఏమోనే దిగలు వారిని పీక్కు తింటోంది.

పిల్లల పెళ్లిళ్లయితే చేశారుగానీ... అంతా కలిసి వుండాలనే కోరిక తీరనే లేదు. ఎవరెవరివుద్యోగాలు... వారి వారి సంసారాలతో తలావక చోటవుండక తప్పటం లేదు.

ఆపసోపాలు పడుతూ రైలు వైజాగ్ చేరింది! చలపతిరావు లోగడ తానెప్పుడూ వైజాగ్ చూచి ఎరుగడు. ఊరు మనుషులు అంతా కొత్తే.!

ప్లాట్‌ఫారం మీద నిలబడి కొడుక్కోసం దిక్కులు చూస్తుండగ చంద్రం కన్పించాడు. హమ్మయ్య వీడు వచ్చాడు సుమా... లేక పోతే అవస్థపడాల్సి వచ్చేది అనుకుంది ఇందిరమ్మ.

ముగ్గురూ కలిసి ఏవేవో మాట్లాడుతూ బైటికి నడిచారు.

'మనిల్లు ఇక్కడికి బాగా దూరమా చంద్రం...'తల్లి అడిగింది.

'మనం వెళ్లాల్సింది సిటీబస్ లోనా... ఆటోలోనా' తండ్రి ప్రశ్న.

'మనం కార్లో వెడదాం..'

'కారు కొన్నావేమిట్రా అబ్బాయ్...' ఇందిరమ్మ సంబరపడింది కొడుకు కారు కొన్నందుకు.

'బేంకు'లోను తీసుకుని కొన్నానుడాడీ..' డ్రైవ్ చేస్తూ చెప్పేడు చంద్రం.

కొంత దూరం వెళ్లేక ఖరీదైన బంగళా ముందు కారాగింది... ముగ్గురూ దిగారు.

ముందుతాను లగేజితో నడుస్తూ' రండి లోపలికి' కన్నవారిని ఆహ్వానించాడు చంద్రం.

ఇంత పెద్ద ఇంటికి అద్దె చాలా ఎక్కువే అనుకుంటాను...' లోనికి అడుగు పెడుతూ అడిగాడు చలపతిరావు.

తామొస్తున్న సంగతి తెల్సుకుని కోడలు ఎదురొచ్చి తమ కుశలమడిగి పరామర్శిస్తుందేమో అనుకున్న ఇందిరమ్మకు నిరాశే మిగిలింది.

'పిల్లలేరీ..' అడిగింది ఇందిరమ్మ చుట్టూ పరికిస్తూ.

'కాన్వెంట్ కెళ్లారు. సాయంత్రం అయిదింటి కొస్తారు. అప్పుడు చూద్దువుగాని నీ మనుమళ్లని..' చెప్పాడు చంద్రం.

'మేడమెట్లు దిగి వస్తూ 'మీరిద్దరూ చిక్కిపోయినట్టుగా వుంది' అత్తా మామని చూస్తూ అంది వల్లి.

'వయసు మీదపడుతోంది కదా..'నసిగాడు చలపతిరావు.

'మీసామాను అదిగో... మెట్ల కింద గదిలో పెట్టుకోండి! మీ పడకలు కూడా అక్కడే..' పొడి పొడిగా మాట్లాడింది వల్లి.

'వళ్లంతా కంపరగా వుంది... ముందు నేను స్నానం చేస్తేగానీ... అలసట తీరదు..' ఇందిరమ్మ చిరాకు పడింది.

'బాత్‌రూమ్‌లో గీజర్ ఆన్ చేశాను... వెళ్లి ఇద్దరూ స్నానాలు కానివ్వండి...' అని మళ్లీ మేడ మీదికి వెళ్లింది.

★★★★★

'ఇంత పెద్ద ఇంటికి అద్దెంత కోడలా?' - భోజనం చేస్తూ అడిగింది.

'అద్దె ఇల్లు కాదులెండి. మీ అబ్బాయి బాంకులో అప్పు తీసుకుని కట్టించారు..'

'ఇల్లు కట్టించిన సంగతి తమకు తెలీపర్చనందుకు చలపతిరావు ఇందిరమ్మ మనసులు చివుక్కుమన్నాయ్.

కోడలు... ఈ విషయం వారికి చెప్పేదేమిటి లెద్దురూ.. ఏదో ఒకనాటికి తెలీక పోతుందా అని అడ్డుపుల్ల వేసి వుంటుంది కొడుకుతో... అందుకే గృహప్రవేశానికైనా వుత్తరం ముక్క రాయలేదు... వాపోయింది ఇందిరమ్మ.

'అది సరేగానీ కోడలా.. మావాడికి జీతం ఎంతొస్తుందేమిటి...?'అడిగేడు చలపతిరావు.

'నాకు తెలీదు! ఎంతొస్తున్నా... ఇంటి అప్పు...కారు అప్పులు తీర్చటానికే చాలదు. పైగా పిల్లలు కాన్వెంట్ చదువులాయె? వైజాగ్‌లో బ్రతకటం కష్టంగా వుంది. అన్నిటి ధరలూ మండి పోతున్నాయ్.' బదులిచ్చింది వల్లి.

కోడలి బడాయి మాటలు ఇందిరమ్మకి తెలీనివికావు. మనిషి వద్ద అంతా దాపరికం! గోప్యం! ఇంటికి సంబంధించిన ఏ విషయాలు బైటికి తెలీనీదు. మొదట్నించీ వల్లి తీరే అంత! ఎంతకీ తన సుఖం సంతోషం తప్ప అత్త మామల గురించి పట్టించుకోదు. మొగుడిని సహాయ పడనివ్వదు. అనేక రకాలుగా భోజనం చేస్తూనే ఆలోచిస్తోంది ఇందిరమ్మ.

కొడుకు దగ్గర కొచ్చి వుంటున్నామనే తృప్తే లేదు చలపతిరావుకు ఇందిరమ్మలకు. కొడుకు ఆఫీసుకి ఎనిమిది కొట్టగానే కార్లో వెళ్లి... ఏ రాత్రికో ఇంటికొస్తాడు. పిల్లలు కాన్వెంట్ కెడతారు. కోడలు ఎ.సి. గదిలోంచి బైటికిరాదు. ఇక తమకు మాత్రం ఇంట్లో ఎంతోచి ఏడుస్తుంది... ముసలివారిద్దరూ మనసులో గొణుక్కున్నారు.

ఆదివారం రోజుమాత్రం తమని కొడుకు కార్లో వూరంతా తిప్పిచూపించాడు. ఈ మధ్య కొడుక్కూడా తమతో మితంగా మాట్లాడటం గమనిస్తున్నారు. ఇదంతా కోడలు తెచ్చిన మార్పే

అనుకున్నారు.

★★★★★

కాఫీ కప్పు అత్తగారి చేతికి అందిస్తూ, మీరొచ్చి నాలుగునెలలైంది. మీ తరువాత హాఫ్టు బెంగుళూరు మీ రెండవ కొడుకు దగ్గర. అక్కడా నాలుగు నెలలుండి చివరి నాలుగు మాసాలు మీ మూడో కొడుకు శేఖర్ ఇంట్లో కాలక్షేపం చేయండి! ముగ్గురు కొడుకులూ మీ బాధ్యతని సమంగా చూసుకోవాలి కదా...'నిక్కచ్చిగా మాట్లాడింది వల్లి.

చలపతిరావు ఇందిరమ్మ ఒకరిముఖాలు మరొకరు చూసుకున్నారు.

'మీ భారాన్ని... బాధ్యతను మేం ఒక్కరం మోయాలన్నా.. మాకు మాత్రం శక్తి వుండద్దూ..' మూతి తిప్పుతూ అంది వల్లి.

మీ పంపకాలు బాగున్నాయమ్మా! మేం చస్తే కర్మ చేయాల్సిన వాడు నా పెద్ద కొడుకు. మమ్మల్ని లక్షణంగా సాగనంపాల్సిన బాధ్యత మీ భుజాల మీద వేసుకోక తప్పదు కోడలా...' ఇందిరమ్మ నోరు విప్పింది.

'అదేం కుదరదు. నే చెప్పేది న్యాయం... ధర్మం కూడాను..' ఓరగా మామగారి వేపు చూసింది.

ఆ రాత్రే ఇంటికొస్తూ రైలు టిక్కెట్లు తెచ్చి చంద్రం తండ్రి చేతిలోవుంచాడు.

కారులో స్టేషన్‌కు తీసుకెళ్లి పేరెంట్స్‌ని రైలెక్కించాడు.

బెంగుళూరు చేరుకునే సరికి వళ్లుహూనంమైందన్పించింది. రైలు ప్రయాణంలోనూ సుఖమెక్కడేడిచింది అనుకున్నాడు చలపతిరావు.

రెండవ కొడుకు మహేష్ స్టేషనుకొచ్చి తల్లి తండ్రీనీ కల్సుకుని ఆటోలో ఇంటికి తీసుకెళ్లాడు.

'స్నానం చేసివస్తూ 'అవున్రా అబ్బీ... కోడలేది...కన్పించదేం?-అడిగేడు చలపతిరావు.

'పుట్టింటికెళ్లిందేమో లెండి...' సమర్థింపుగా మాట్లాడింది ఇందిరమ్మ.

'అదేం కాదు.. అది హాస్పిటల్లో వుంది..'

మహేష్ మాటలకు నోటమాట కరువైంది.

'అయ్యో .. అదేమిట్రా... ఏమిటి సుస్తీ..; కంగారు పడుతూ అడిగింది ఇందిరమ్మ.

'ఏమని చెప్పనే..దాని ఖర్మ..! దాని దురదృష్టం..నాలుగు సార్లు అబార్షనయ్యింది...'

'మాకు ఉత్తరమైనా రాయలేదేంరా?- నిలదీసింది కొడుకుని.

'తెలిసినా ఎవరు మాత్రం ఏం చేయగలరు?'

'అదేమిట్రా అట్లా అంటావ్... పోనీ కోడలి తల్లి తండ్రులకైనా తెలీపరిచావా..? అడగేడు తండ్రి.

'వ్యాధి ముదిరిపోయిందన్నారు డాక్టర్లు. ఏ క్షణంలోనైనా కళ్లుమూయచ్చట..'

'అసలు వ్యాధేమిటన్నారు వైద్యులు' చలపతిరావు ప్రశ్నలో ఆత్రుత ప్రస్ఫుటమైంది.

ఇప్పుడేమో కేన్సరట! ఈ మహమ్మారి రోగానికి వైద్యం లేదన్నారు. ఉపశమనానికంటూ ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు...' మహేష్ కాళ్లొత్తుకున్నాడు.

'ఇంత చిన్న వయసులో నీ కెంత కష్టమొచ్చిందిరా..' తలనిమురుతూ తల్లి ఓదార్చే ప్రయత్నం చేసింది.

'మా అత్తామామలు వయస్సు మీద పడటంతో రాలేమన్నారు. ఒకసారి బావమరిది వచ్చి చూసివెళ్లాడు.. కట్టు కున్న వాడిని నాకు తప్పదుగా..' మహేష్ కంఠం జీరవోయింది.

'ఈ విషయం మీ అన్నయ్యకు తమ్ముడిక్కూడా తేలీదా-' అడిగేడు చలపతిరావు.

'ఎవ్వరికీ చెప్పలేదు నాన్నా?! బాధని నా మనసులోనే దాచుకున్నాను.'

'సరే సరే... వెళ్లి కోడలిని ఓ మారు చూచి పరామర్శించి...ధైర్యం చెప్పొద్దాం పద...'తల్లి తొందర పెట్టింది.

'మనం వెళ్లినా ఇప్పుడు లోనికి వెళ్లనివ్వరు. మీకు కేరయర్ తెప్పిస్తాను ఈపూటకి. కాస్తంత తిని విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే మిమ్ములను ఆసుపత్రికి తీసుకెడతాను.

'మరి నీ భోజనం మాటేమిటిరా' తల్లి అడిగింది.

'నేను కేంటిన్లో తింటాలే.. ఇంట్లో అన్నీ వున్నాయి. రాత్రికి నువ్వు వంట చేద్దువుగాని. సుఖ పడదామని కొడుకు ఇంటికొచ్చినా నీకు చాకిరి తప్పలేదే అమ్మా'...

'అలా అనకురా! నీ కొచ్చిన ఆపద అలాంటిది. నీకు వండి పెట్టటం మా బాధ్యత కాదట్రా పిచ్చి సన్నాసీ బాధపడకు... కోడలికి నయమౌతుంది. ఆందోళన పడకు. కొండకొస్తానని వెంకటేశ్వరస్వామికి మొక్కుకో... అన్నీ చక్కబడతాయ్'.

తల్లి వాత్సల్య పూరితమైన ఓ దార్పు మహేష్‌కి కొత్త శక్తి నిచ్చినట్టన్పించింది.

సూర్యాస్తమయ సమయానికి తల్లితండ్రిని వెంట పెట్టుకుని మహేష్ హాస్పిటల్ చేరుకున్నాడు.

విజిటర్స్ వేళ కావటాన గేటు దగ్గర వాళ్లెవరూ అడ్డు చెప్పలేదు.

నేరుగా వార్డ్ చేరుకున్నారు ముగ్గురూ!

బెడ్ మీద వున్న సంధ్య నడిచివచ్చే అత్తమామలను చూచింది. దగ్గరవగానే 'మీరెప్పుడొచ్చారు అత్తయ్యా...'అడిగింది.

'ఇప్పుడు మా గురించి ఎందుకులే సంధ్యా? - నీ గురించి మహేష్ అంతా వివరంగా మాకు చెప్పాడు. మేం చాలా బాధ పడ్డాం. బంగారంలాంటి పిల్లవు. ఎలా వుండవలసిన దానివి ఎలా కళ్లల్లో ప్రాణాలు పెట్టుకు వున్నావో చూస్తుంటే కడుపు తరుక్కు పోతోంది. కళ్లనీళ్లు పెట్టుకుంది ఇందిరమ్మ.

'నాకేం? నేను బాగానే వున్నాను అత్తయ్యా! మీ అబ్బాయే బెంగ పెట్టుకున్నారు. ఇంతకు ముందే డాక్టరొచ్చి మరో రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తారని.. ఇంటకి వెళ్లి పోవచ్చని చెప్పారు. - నా గురించి మీరేం దిగులు పెట్టుకోవద్దు!... లేని సంతోషాన్ని ముఖానికి పులుముకో ప్రయత్నించింది సంధ్య.

'అవున్లేమ్మా! నీకు మేము ధైర్యం చెప్పాల్సిందిపోయి నీకు నువ్వే మృత్యువుని కడుపులో దాచుకుని పైకి బింకంగా మాట్లాడుతున్నావా సంధ్యా...' తల నిమురుతూ బుజ్జగించింది అత్తగారు.

'అధైర్య పడకు సంధ్యా.. ఆ దేవుడు నీకు మంచే చేస్తాడు. నీకు తోడుగా మేం వచ్చాం కదా.. ఏం భయం లేదు. ధైర్యంగా వుండు...' చలపతిరావు ఓదార్పుగ మాట్లాడాడు.

'నాకేం భయంలేదండీ... నా దిగులంతా మీ అబ్బాయి గురించే. ఆయన్ను వంటరి చేసి నాతోవన నేను వెళ్లిపోతున్నందుకు బాధగా వుంది.' సంధ్య కంటికొలుకుల్లో నీరు తొణికిసలాడింది.

'ఆ పిచ్చి మాటలే మాట్లాడద్దు... మనసులో దిగులు పెట్టుకుంటే... ఎంతటి ఆరోగ్యవంతులైనా కృశించిపోతారు. ఆ దేవుడు నీకు అన్యాయం చెయ్యడు. నువ్వు పండు ముత్తైదువుగా నిండు నూరేళ్లు జీవిస్తావ్!... అధైర్యపడకు...'

అత్తగారి బుజ్జగింపు మాటలకు సంద్య మనసు తేలికపడ్డట్టన్పించింది.

★★★★★

క్రమేపి కోలకుంటోంది సంధ్య, కానీ... వయసు మీద పడినఅత్తగారి చేత సేవలు చేయించుకోవలసి వచ్చినందుకు మనసు నొచ్చుకుంటోంది.

'సంధ్యా! ఇక నీకేం భయం లేదని డాక్టర్లన్నారు కదా!.. వేళ పట్టున మందులు వాడుతుండు... మేం వున్నన్నాళ్లూ నీ కేం కష్టమూ రానీయం... మేం వెళ్లేక అంటావా... నువ్వు శ్రమపడి అలిసి పోకుండా.. పనిమనిషి... వంట మనిషీ పెట్టుకో...! - నేనూ మహేష్‌తో చెప్తాను... ఏడాదితిరక్కుండానే మళ్లీ నువ్వు కొత్త పెళ్లి కూతురులా కనిపిస్తావ్...' కోడలు

మనసులో బాధ మర్చిపోవటానికి సలహా ఇచ్చింది ఇందిరమ్మ.

సంధ్య ఈ మాత్రంగా లేచి తిరుగుతుందని వూహించలేక పోయాడు మహేష్... భార్య త్వరగా కోలుకోవటం చూచి తనలో సంతోషం తొంగి చూచింది.

మహేష్ ఆఫీసుకు బయల్దేరబోతూండగా సెల్ రింగైంది.

మొబైల్ చేతిలోకి తీసుకొని బటన్ ఆన్‌చేసి 'హలో... ఎవరు మాట్లాడేది... నువ్వా శేఖర్... ఏమిటి ఇన్నాళ్లకు నేను గుర్తు కొచ్చాను... ఆ! అమ్మానాన్నా ఇక్కడే వున్నారు. ఏమిటీ వాళ్లని వున్న ఫళాన బయల్దేరి హైదరాబాద్ నీ దగ్గరికి పంపమంటావా? ఏమిటి... అయ్యో అట్లాగే.. టిక్కెట్లు దొరికితే ఈ రోజు ట్రెయిన్ లోనే పంపుతాను... లేక పోతే రేపు తప్పక రైలెక్కిస్తాను.. ..అలాగే... అలాగే... నేను ఇప్పుడు రాలేను. తర్వాత వచ్చి చూస్తాను... వుంటాను...' సెల్ ఆఫ్ చేసాడు.

'ఎక్కడ్నించిరా ఆ ఫోను...మీ ఆఫీసు వాళ్ళెవరైనానా..' హాల్లోకి వస్తూ చలపతిరావు కొడుకుని అడిగాడు.

'లేదు డాడీ! హైదరాబాద్ నుంచి తమ్ముడు ఫోన్ చేసాడు.!

'ఎవరు శేఖరా'

'వాడే! మిమ్మల్ని వెంటనే అక్కడికి పంపమంటున్నాడు'

'మరదలుకు యాక్సిడెంట్ అయ్యిందట. సిటీబస్సు దిగుతుండగా కాలుజారి పడ్డదట...వెంటనే బస్సు కదలడంతో రెండు కాళ్ల మీది నుంచి బస్సు వెనుక టైర్లు పోవడంతో ప్రాణాపాయం తప్పినా బలమైనగాయమే అయిందని చెప్పాడు. ఇప్పుడు హాస్పిటల్లో వుందిట.. మిమ్మల్ని ఈ రోజు ట్రెయిన్‌కే వాడి వద్దకు పంపమన్నాడు.'

'అయ్యో ఖర్మ... ఇదేందురదృష్టంరా... ఏమేవ్.... నీ మూడో కొడలికి యాక్సిడెంట్ అయిందట...మనల్ని వున్నపళాన బయల్దేరమని శేఖర్ ఫోన్ చేశాడిప్పుడే... స్వరం పెంచి వంటింట్లో వున్నభార్యకి విన్పడాలని పెద్దగా మాట్లాడాడు.

ఈ మాట విన్న ఇందిరమ్మకు అంతా అయోమయంగా తోచింది. కాలు చేయి అడలేదు.

'ఇదేం తలరాతండీ... కష్టాలన్నీ మన పిల్లల మీదే మూకుమ్మడిగా దాడి చేసినయ్' గాభరాగా మాట్లాడింది.

'ఆఫీసు నుంచి వస్తూ ట్రెయిన్ టిక్కెట్లు తెస్తాను. నేనొచ్చే సమయానికి మీరిద్దరూ రెడి అవండి...' అని చెప్పి స్కూటర్ మీద ఆఫీసుకు వెళ్లాడు మహేష్!

★★★★★

ఇద్దరినీ ట్రయిన్ స్లీపర్ బోగీలో ఎక్కించి దారి ఖర్చుకి ఓ వెయ్యి రూపాయలు తండ్రి చేతిలో వుంచి... "ఆందోళన పడొద్దు... జాగ్రత్తగా వెళ్ళిరండి. మీరు చేరగానే తమ్ముడితో ఫోన్ చేయించండి." సెండాఫ్ చెప్పాడు మహేష్.

రైలు బయల్దేరింది!

శ్రీకాకుళం

ఇద్దరిలోనూ పిల్లల గురించే దిగులు! రెండో కోడలు ఇట్లా... మూడవ కోడలు చూడబోతే అట్లా... ఈ వయసులోనూ తమకు మనో వేదన తప్పటం లేదు.ఇంకా తామిద్దరూ ఎందుకు బతికివున్నట్టు..? ఇలాంటి దుస్సంఘటనలు పాపిష్ఠి కళ్లతో చూడటానికేనా అనే బాధ వారిని వేధిస్తోంది.

రైలు పరుగుపెడుతూనే వుంది. స్టేషన్లు దాటి పోతోంది. కొడుకు కొనిచ్చిన పండ్లు తిని కాసిని మంచినీళ్లు తాగి ఈ రాత్రికీ తిండి చాలనుకున్నారు.

రాత్రి పదిగంటలకి ఇద్దరూ బెర్తుల మీదపడుకునినిద్రలోకి జారిపోయారు.

అర్ధరాత్రి సమయం కావస్తోంది. బోగీలో ప్రయాణీకులు నిద్రమత్తులో వున్నారు. అలుపెరుగని బాటసారి లాగా రైలు పరుగు పెడుతూనేవుంది.

ఉన్నట్టుండి భూనభోంతరాళాలు బ్రద్దలైనంత శబ్దం! కంపార్ట్‌మెంట్ అంతా పొగ దట్టంగా అలుముకుంది! లిప్తపాటులో మంటలు చెలరేగినయ్.

నిద్రమేలుకున్న పిల్లా పెద్ద... ముసలిముతక... ఆడమగ అందరిలోనూ భయం! చచ్చి పోతామేమోననే తత్తర పాటుతో కేకలు పెడుతూ... రోదిస్తూ... అటు ఇటు పరుగెత్తటం... తోపులాట! తలుపులు లాక్‌చేసి వుండటంతో తెరుచుకోలేదనే నిస్పృహ"

పొగలో... చెలరేగిన మంటల్లో ఏం జరుగుతోంది ఎవరికీ అర్థం కాలేదు.

హాహా కారాలు... రోదనలు..చావు కేకలు.. కంపార్ట్‌మెంట్ నిముషాల్లో భస్మీపటలమైంది. అందులోని ప్రయాణీకులు బూడిదై మిగిలారు.

ఎవరూ ఊహించని ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ట్రయిన్ మరి కొద్ది దూరం పోయి ఆగింది. మిగతా కంపార్ట్‌మెంట్లోకి అగ్నికీలలు ప్రవేసిస్తాయేమో అని మిగిలినవారు అంత చీకటిలోనూ దిగి ట్రాక్ ప్రక్కన నిలబడ్డారు. మంటలు ఆర్పటం ఎవ్వరి వల్లా కాలేదు. ఇంజన్ డ్రైవరొచ్చి మిగతా బోగీలకు ప్రమాదం జరుగకుండా బోగీలను విడదీశాడు.

రెండు బోగీలు భస్మీపటలమైనయ్. బోగీల్లో ప్రయాణిస్తున్న ఏ వక్కరూ ప్రాణాలతో బతికి బైట పడలేక పోయారు.

అంతా కాలి బూడిదైన వారిలో చలపతిరావు ఇందిరమ్మ వున్నారు. ఏశవం తాలూకు బూడిద ఏదో తెలుసుకోగల అవకాశం లేకుండా పోయింది.

కాలిపోయిన ట్రెయిన్ బోగీల్లో బూడిదైన తల్లిదండ్రుల కోసం గుండెలు పగిలేలా ముగ్గురు కొడుకులూ దుఃఖించారు.

-:(సమాప్తం):-